క్లుప్తంగా

శాకాంబరిదేవి అలంకరణలో అమ్మవారు

సింహాద్రిపురం : మండలంలోని భానుకోట శైవక్షేత్రంలో మంగళవారం ఆషాఢమాసం పూజలు నిర్వహించారు. పార్వతిదేవి అమ్మవారిని శాకాంబరిగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని ఆలయ అర్చకులు సురేష్‌శర్మ, బద్రీశర్మలు అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రిమాండ్ ఖైదీలను పరామర్శించిన రెడ్యం సోదరులు

కమలాపురం : కమలాపురం సబ్‌జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలను రెడ్యం సోదరులు పరామర్శించారు. ఖాజీపేట మండలం పత్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కమలాపురం సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. మంగళవారం ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డిలు కమలాపురం సబ్‌జైలుకు చేరుకుని జైలులో ఉన్న వైఎస్సార్ సీపీ నేతలను పరామర్శించారు.

ఆకాశాన్నంటుతున్న కాంచర కాయల ధర

పులివెందుల రూరల్ : ప్రస్తుతం మార్కెట్‌లో కాంచర కాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. చికెన్ ధరలతో కాంచర కాయలు పోటీపడుతున్నాయి. చికెన్ మార్కెట్‌లో రూ.220 ఉంటే కాంచరకాయలు రూ.200 పలుకుతోంది. దీంతో సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి. వీటితో పాటు కూరగాయల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి.

ఓపెన్ డ్రింక్ చేస్తే కేసు నమోదు

ముద్దనూరు : బహిరంగంగా మద్యపానం తాగినవారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి ముద్దనూరు మండలకేంద్రంలో బహిరంగ ప్రదేశాలను తనిఖీ చేసి కొన్ని ప్రదేశాలను శుభ్రం చేయించారు.

అన్నక్యాంటిన్ పనుల పరిశీలన

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని అన్నా క్యాంటిన్ పనులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్యలు పరిశీలించారు. ఆగస్టు రెండోవారంలో క్యాంటీన్ ప్రారంభం అయ్యే అవకాశం ఉందని ఆలోగా పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సురేష్, కౌన్సిలర్ నాగరెడ్డి, కాంట్రాక్టర్ కోగటం నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు తోడ్పడాలి

కమలాపురం : ప్రతి ఒక్కరూ సమాజ సేవకు తోడ్పడాలని ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మన ఊరు సేవా సమితి పంచమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వ్యవస్థాపకుడు శీలం శ్రీనివాసులు వితరణ చేసిన దుస్తులను పేదలకు ఆయన అందజేశారు. కరోనా మొదలు కొని ఇప్పటి వరకు ఆయన చేస్తున్న సేవలు పలువురు ప్రశంసనీయం అని కొనియాడారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ మోహన్‌రెడ్డి, మన ఊరు సేవా సమితి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పార్నపల్లెలో విద్యుత్ అంతరాయం

లింగాల : మండలంలోని పార్నపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ బాలసంజీవులు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కె.వి. వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్లను తొలగిస్తున్నామని రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తాం


రైతుల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్.రమణ, తదితరులు

తొండూరు : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తామని, అలాగే ప్రజల సహకారంలేనిదే విద్యుత్ ప్రమాదాలు నివారించలేమని వైఎస్సార్ జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఎస్.రమణ తెలిపారు. మంగళవారం మల్లేల గ్రామంలోని 33/11కె.వి. సబ్‌స్టేషన్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యుత్ పనులు చేసేటప్పుడు సిబ్బంది భద్రతా నియమాలు పాటించాలన్నారు. లో ఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారులు, రైతులు విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు అధికారులు సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో తొండూరు, సింహాద్రిపురం మండలాల అధికారులు, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

విరాటపర్వ పఠనం

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీపద్మావతి సమేత వేంకటరమణస్వామి ఆలయంలో మంగళవారం విరాట పర్వ పఠనం నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురవాలని 6వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు విరాటపర్వ పఠనం నిర్వహిస్తున్నట్లు పులివెందుల ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అన్నదాత సుఖీభవ కోసం రైతులు ఎదురు చూపులు

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం రైతుల సంఖ్య (సుమారు)
40,000 మంది

సాగయ్యే ప్రధాన పంటలు
వరి, వేరు శనగ, పత్తి, మినుము, బుడ్డ శనగ, అరటి, చీనీ తదితర పంటలు

సాగు విస్తీర్ణం
సుమారు **23,525** ఎకరాలు

పథకం లబ్ధిదారుల సంఖ్య
సుమారు **38,000** మంది



కమలాపురం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని అర్హత గల రైతులకు గత 5 సంవత్సరాలుగా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం కింద సంవత్సరానికి ఒక్కో రైతుకు రూ.13,500 చొప్పున రైతుల ఖాతాలకు జమ చేసిన నిధుల వివరాలు ఇలా వున్నాయి.
ప్రస్తుతం నియోజవర్గంలోని సుమారు 38 వేల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కో రైతుకు రూ.20 వేల చొప్పున చెల్లించాల్సిన మొత్తం – 76 కోట్లు

సంవత్సరం	రైతుల సంఖ్య	జమ అయిన నిధులు (కోట్లలో)
2019-20	28,593	38.60
2020-21	32,343	43.41
2021-22	31,391	42.38
2022-23	37,438	50.54
2023-24	36,576	39.56
5 సంవత్సరాల్లో	1,66,341	214.49

జమ్మలమడుగు నియోజకవర్గంలోని

రైతులు	రైతుల ఖాతాలలో జమ అయిన డబ్బు
27,640	131.63 కోట్లు

వల్లూరు : 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నెరవేరుస్తూ రైతు భరోసా పథకం కింద పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6000లతో కలిపి ఒక్కో రైతుకు సంవత్సరానికి రూ.13,500 చొప్పున వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. 4 సంవత్సరాల పాటు ఇస్తానని చెప్పినప్పటికీ 5 సంవత్సరాల పాటు పథకాన్ని అమలు చేశారు. ప్రతి ఏడూ ఖరీఫ్ ప్రారంభంలోనే రైతుల ఖాతాలకు నిధులను జమ చేసి తోడ్పాటు నందించడంతో రైతులకు పంటల సాగు ఖర్చులకు ఉపయోగకరంగా వుండేది. షెడ్యూల్ మేరకు నిధులు జమ చేయడంతో రైతులకు పంట ఖర్చులకు కొంత వరకు ఇబ్బందులు వుండేవి కావు.

- ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకం కింద సంవత్సరానికి ఒక్కో రైతుకు రూ.20 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఖరీఫ్ ప్రారంభమై సుమారు రెండు నెలలు కావస్తోంది. ఈ నేపథ్యంలో రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల వరి, మినుము వంటి పంటలను సాగు చేశారు. పూర్తి స్థాయిలో పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. పంటల సాగు ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ ప్రారంభంలోనే నిధులు జమ కావడంతో ఇబ్బందులు వుండేవి కావని, టీడీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ పథకం కింద నిధులు జమ చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటి వరకూ కనీసం పథకం ఊసే ఎత్తక పోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఇచ్చిన మాట మేరకు ప్రభుత్వం రైతుల ఖాతాలకు నిధులు జమ చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

రైతులకు అందించే ఆర్థిక సాయంపై ఊసే లేదు..



రాష్ట్ర ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ మొదలైంది. ఇంత వరకు రైతులకు భరోసా డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం జమచేయలేదు. ఎన్నికల సమయంలో చెప్పిన హామీ ప్రకారం రైతులకు రూ.20 వేలు జమచేయాలి. కేంద్రం వాట జమా అయింది. రాష్ట్ర వాటపై ఇంత వరకు ఏ నిర్ణయం తీసుకోలేదు.

– డి.సూర్యనారాయణరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు, ఎర్రగుంట్ల

రైతుభరోసా వెంటనే ఇవ్వాలి..



రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇంతవరకు రైతు భరోసా పథకం అమలుకు నోచుకోలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వర్షాలు కురిసినా చేతిలో డబ్బులు లేక పంటలను సాగుచేసుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. జగన్ ప్రభుత్వం సీజన్ ప్రారంభం అయ్యేనాటికి రైతు భరోసా పథకం ద్వారా డబ్బులు రైతుల అకౌంట్లలో జమచేసేవారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంతో అప్పుల కోసం వెంపర్లాడుతున్నాం.

– రాఘవరెడ్డి, రైతు, వేముల

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. ఏటా సాగు ఖర్చులకు అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగుకు బాసటగా ప్రభుత్వం నిధులను తక్షణం రైతుల ఖాతాల్లో జమ చేయాలి. సకాలంలో విత్తనాలు, ఎరువులతో పాటు రైతులకు అవసరమైన ఉత్పత్తులు అందిస్తే రైతులు ఆటంకం లేకుండా వ్యవసాయం చేసుకుంటారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేయడం, పంట పొలాలు సిద్ధం చేసుకోవడం తదితర పనులు చేసుకోవడానికి వీలుగా ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాల్లో తక్షణం జమచేయాలి.

–పి. చంద్రశేఖర్, సీపీఐ ఏరియా కార్యదర్శి, కమలాపురం

అధైర్య పడొద్దు–అండగా ఉంటా!

- ప్రతి కార్యకర్త నా కుటుంబ సభ్యులతో సమానం
- మాజీ ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : కార్యకర్తలు, నాయకులు ఎవరు కూడా అధైర్య పడవద్దని, ప్రతి కార్యకర్త తన కుటుంబ సభ్యులేనని అందరికీ అందుబాటులో ఉంటూ, అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం చెన్నూరులోని మైనార్టీ నాయకులు అబ్దుల్‌రబ్ నివాసంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులే లక్ష్యంగా వారి ఆస్తినష్టం తోపాటు ప్రాణాలు సైతం తీస్తున్నారన్నారు. కక్ష సాధింపు మానుకుని అభివద్ధి సంక్షేమంపై దృష్టి సారించాలని ఆయన టీడీపీ తీరుపై మండిపడ్డారు. వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలకు ఏదైనా సమస్య వచ్చిందంటే తక్షణమే ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చెన్నూరు టౌన్, మండల కార్యకర్తలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి సమస్యను ఆయన సావధానంగా విన్నారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలను పలకరించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జి.ఎస్.భాస్కర్‌రెడ్డి, ఆర్.వి.ఎస్.ఆర్.ముదిరెడ్డి రవిరెడ్డి, ఎర్రసాని మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రఓబుల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మైనార్టీ నాయకులు, అన్వర్‌బాషా, అబ్దుల్‌రబ్, వారిస్, మునీర్ అహ్మద్, జుమన్, హజ్రత్, సాదిక్ అలీ, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు భాగ్యమ్మ, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


ఇన్‌చార్జి సీఐ చేతుల మీదుగా బహుమతులను అందుకుంటున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : పులివెందుల యువ మార్షల్ ఆర్ట్స్ అకాడమి విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్ దినేష్ తెలిపారు. ఈనెల 21న ప్రొద్దుటూరులో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీలలో తమ విద్యార్థులు స్వర్ణ, రజిత పతకాలు సాధించి తాడిపత్రిలో జరుగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జి సీఐ మోహన్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులను, సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. అండర్ 59 కేజీలో చరణ్‌కుమార్‌రెడ్డి, అండర్–54 కేజీలో మంజుల బంగారు పతకాలు సాధించారు. అలాగే గురువేంద్ర, నరేష్‌కుమార్‌లు సిల్వర్ పతకాలు సాధించారు. సబ్‌జూనియర్ విభాగంలో అండర్–26 కేజీల విభాగంలో చిర్విత, నందినిలు బంగారు పతకాలు సాధించగా చేతన్ సిల్వర్ మెడల్, జయపాల్ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు ఆయన తెలిపారు. ఏడు మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా ఆరు మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్ తెలిపారు.

పోష్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల టౌన్ : మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నివారణ కోసం ఏర్పాటు చేసిన పోష్ చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి ఈ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలు అంతర్గత కంప్లయింట్ చేయడంతోనే లైంగిక వేధింపులు నివారణ సాధ్యమని.. కావున ఈ పోష్ చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కమిటీలలో మహిళనే చైర్‌పర్సన్‌గా ఉంటుందని, మిగిలిన వారు సభ్యులుగా ఉండాలని, జిల్లా కేంద్రంలో లోకల్ కంప్లయింట్ కమిటీ ఉంటుందన్నారు. ఇక్కడ ప్రతీ కేసు నమోదు అవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, అన్ని సచివాలయాల సిబ్బంది, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన

వేంపల్లె : పనిప్రదేశాల్లో మహిళల లైంగిక వేధింపుల నివారణపై ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సునీత అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సదస్సు ఆమె పాల్గొని మాట్లాడారు. పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. భారత ప్రభుత్వం 2013 ఏప్రిల్ 23న పోష్ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. వేధింపుల ఫిర్యాదు చేసేందుకు ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో ఇచ్చిన తీర్పులో సంతృప్తి పొందకపోతే ఈ చట్టం కింద కోర్టును ఆశ్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివిజసంపతి, ఏఎస్ఐ వేణుగోపాల్, ఐసీడీఎస్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధి చేకూర్చేందుకే పండ్ల తోటల పెంపకం

కమలాపురం : ఐదెకరాల్లోపు పొలం ఉన్న రైతులకు అదనపు ఆదాయం చేకూర్చేందుకే పండ్ల తోటల పెంపకంను ప్రోత్సహిస్తున్నట్లు ఉపాధి హామీ ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ జ్యోతి అధ్యక్షతన అగ్రికల్చర్, హార్టికల్చర్, ఉపాధి సిబ్బందితో ఆయన రివ్యూ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఐదెకరాల్లోపు పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక రాయితీలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. అన్ని గ్రామాల్లోని రైతులకు ఈ విషయాలను తెలియజేసి ఆసక్తి ఉన్న రైతుల ద్వారా దరఖాస్తు చేయించాలన్నారు. చెట్టు నాటినప్పటి నుంచి మూడేళ్ల పాటు నిర్వహణకు, ఎరువులకు, నీటి తడులు అందించేందుకు రైతులకు పేమెంట్ ఇస్తామన్నారు. అలాగే పండ్ల తోటలను పరిశీలించి అధిక దిగబడులు సాధించేందుకు సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. తద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పార్థసారధి, జేఈ, టీఏలు, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముగిసిన ఇస్మాయిల్‌స్వామి పీరు ఉత్సవాలు

సింహాద్రిపురం : మండలంలోని బిదినంచెర్ల గ్రామంలో మంగళవారం ఇస్మాయిల్‌స్వామి పీరు ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. జలసమాధి కార్యక్రమం నిర్వహించారు. భారీ ప్రజలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. వివిధ వేషధారణలు అలరించాయి.

లింగాల : మండలంలోని పార్నపల్లెలో మంగళవారం మొహర్రం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పీర్లను డప్పులు మేళాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

పెండ్లిమర్రి : యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పెండ్లిమర్రి, నందిమండలం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సిలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారిని సి.సాయిగ్రేస్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. దేశ భక్తి కలిగి ఉండి దేశ సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లో భాగా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గుణశేఖర్, పాఠశాల హెచ్‌ఎంలు వెంకటసుబ్బయ్య, ప్రసాద్‌వావ్, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ పోషకాహార సంస్థ సామాజిక సర్వే

లింగాల : జాతీయ పోషకాహార సంస్థ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అశ్వయుజ జూనియర్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో మండలంలోని చిన్నకుడాల, రామట్లపల్లి గ్రామాల్లో సామాజిక సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఒక్కొక్క గ్రామంలో 15 కుటుంబాలను ఎంపిక చేసి గృహంలోని ప్రతి సభ్యునికి రక్తపరీక్ష చేసి ఎంతస్థాయిలో షుగర్, ప్రొటీన్, న్యూట్రీషియన్, విటమిన్, గ్లూకోజ్ నిల్వలు ఉన్నాయని పరీక్షలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య స్థితి గతులను అధ్యయనం చేయడానికి, ఆహారంలో పోషక విలువల స్థాయిని గుర్తించేందుకు ఈ సర్వే చేపట్టామని లింగాల పీహెచ్‌సీ డాక్టర్ కళ్యాణ్ దినకర్ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివరాం, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన సమగ్రశిక్ష అధికారిణి


రికార్డులను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ట్రైనింగ్, ప్రోగ్రాం రాష్ట్ర అధికారిణి కల్పనశైల

వేంపల్లె : స్థానిక భవిత దివ్యాంగ కేంద్రాన్ని సమగ్ర శిక్ష అభియాన్ ట్రైనింగ్, ప్రోగ్రాం రాష్ట్ర అధికారిణి కల్పనశైల సందర్శించారు. మంగళవారం భవిత కేంద్రంలోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం భవిత కేంద్రంలో చదువుతున్న చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. చిన్నారులందరూ చక్కగా ఉన్నారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఈ జిల్లా కోఆర్డినేటర్ కేశవరెడ్డి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ రమణమూర్తి, ఎంఈఓలు జాఫర్, స్టాలిన్‌తో పాటు ఐఈఆర్టీలు యశోద, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

స్థలాలు కోల్పోయిన బాధితులకు న్యాయం జరిగేనా?

వల్లూరు : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చెన్నూరు కొత్త రోడ్డులో స్థలాలు కోల్పోయిన వారికి న్యాయం జరిగేనా అని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. 2014వ సంవత్సరంలో కడప–కర్నూలు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొత్త రోడ్డుపై ఒక్కొక్కరి నుంచి రెండు సెట్ల నుంచి ప్రభుత్వం స్థలాలను తీసుకోవడం జరిగింది. కానీ మార్కెట్ ప్రకారం ఒక సెంటు లక్ష నుంచి ఒకటిన్నర లక్ష రూపాయలు పలికింది. ప్రభుత్వం నిర్ణయించిన విలువ కేవలం రూ.17,000 బాధితులకు నష్టపరిహారం చెల్లించారు. పలుమార్లు జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు, స్థానిక రెవెన్యూ అధికారులు, పరిశీలన చేసి బాధితులకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక్కొక్కరికి రెండు సెంట్లు స్థలం కేటాయిస్తామని స్థల యజమానులకు తెలిపారు. అదేవిధంగా స్థల యజమానుల నుంచి పలుమార్లు రెవెన్యూ స్థానిక సిబ్బంది అర్జీలను తీసుకోవడం జరిగింది. దశాబ్ద కాలం గడుస్తున్నా ప్రభుత్వ అధికారులు కేవలం మాటలకే పరిమితం అయ్యారు కానీ స్థలాల కేటాయింపు చేసే విషయంలో అమలకు నోచుకోలేదని స్థలాలు కోల్పోయిన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 10వ తేదీన చెన్నూరులో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి దృష్టికి ఈ విషయం స్థానిక మండలాధ్యక్షుడు చీర్ల సురేష్ యాదవ్ తీసుకెళ్లారు. ఈ విషయం పరిశీలించాలని ఎమ్మెల్యే స్థానిక రెవెన్యూ అధికారికి చెప్పడం జరిగింది. స్థలాలు కోల్పోయిన బాధితులకు స్థలాలు కేటాయించడంపై దృష్టి పెట్టినట్టు స్థానిక తెలుగుదేశం నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కోల్పోయిన వారిలో ఎక్కువమంది తమ గృహాలను కోల్పోవడంతో పాటు, ఉపాధిని కోల్పోవడం జరిగింది. కొంతమంది ఉన్న రెండు సెంట్లలో ఇల్లు దుకాణం రెండిటితో జీవనోపాధిని ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా అటు అధికారులు, ఇటు ప్రజాపతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి.

సలహాలు, సూచనలు పాటించాలి


డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : పంటల సాగులో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని జంభాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా సంబటూరు సుబ్బారెడ్డి పొలంలో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ పంటను ఆమె పరిశీలించారు. పంట సాగు, నిర్వహణ, దిగుబడి, తదితర అంశాలపై రైతుతో ఆరా తీశారు. మూడేళ్ల క్రితం సాగు చేసిన ఈ పంటలో గత ఏడాది 2 టన్నుల దిగుబడి వచ్చిందని, ఈ ఏడాది పంట దిగుబడి పెరుగుతుందని రైతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు, శాస్త్ర వేత్తల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా మరిన్ని పంటలు సాగు చేయాలని ఆమె గ్రామ రైతులకు వివరించారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాల సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పార్థసారధి, టీఏ మేరీ, ఎఫ్ఏ రవీంద్ర, రైతు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం


యూనియన్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : భారతీయ మజ్దూర్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఎంఎస్ అనుబంధ ఆంధ్రరాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు కర్నాటి ఎల్లారెడ్డి పాల్గొన్నారు. బీఎంఎస్ 69 ఏళ్లు పూర్తి చేసుకుని 70వ సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. కార్మికుల ఉద్యోగుల సమస్యల పరిష్కారాల కోసం యూనియన్ ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్టీపీపీ రీజనల్ అధ్యక్షుడు ఆర్‌వీ రంగనాథ్, కే వీరారెడ్డి, వీ రాజారెడ్డి, వై గంగాధర్, ఆర్.సుందరం, ముస్తాఫా, షబ్బీర్, హరిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి


ఎస్ఎస్‌ఏ ప్రాజెక్టు అధికారిణి కల్పనశైలకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

వేంపల్లె : వేంపల్లెలోని గుర్తింపులేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో మండల విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని రాయలసీమ విద్యార్థి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండెల ఓబులేసు తెలిపారు. మంగళవారం వేంపల్లెకు విచ్చేసిన సర్వశిక్ష అభియాన్ ప్రోగ్రాం రాష్ట్ర అధికారిణి కల్పనశైలకు ఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు, టీఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజ్, పీఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసులు ఎంఈఓ జాఫర్‌ను మూడు మండలాల బాధ్యతల నుంచి తొలగించాలని కోరారు. గుర్తింపు లేని పాఠశాలలపై విద్యాశాఖ అధికారి చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై స్పందించిన ఎస్ఎస్ఏ ప్రాజెక్టు అధికారిణి కల్పనశైల విద్యాశాఖకు చెందిన రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వేముల : దోమకాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మంగళవారం వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని చాగలేరు గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి, నిల్వలున్న నీటిలో, నీటి తొట్లలో అబేట్, దోమల నివారణ కొరకు ఏసీఎం పిచికారీ చేయించారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. లార్వా నిర్మూలనకు ఫ్రైడే డ్రైడే పాటించాలని, ఇంటి పరిసరాలలో చెత్తచెదారాలు, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మీకళ్యాణి, హెల్త్ సూపర్‌వైజర్ రమేష్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.